ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |


TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

మంగళవారం 10, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :177 | పేజీలు :4 | వెల. 3/-





2

## మెగా ఈవెంట్ల కోసం స్టేడియాలను
# ఆధునీకరించాలి

- స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇతర స్టేడియాల్లో వసతులు కల్పించాలి
- మెగా ఈవెంట్లకు ఆతిథ్యం ఇచ్చేలా మైదానాలను తీర్చిదిద్దాలి
- క్రీడా శాఖపై సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ

అంతర్జాతీయ క్రీడా యవనికపై తెలంగాణ జెండా రెపరెపలాడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహానికి పదును పెట్టారు. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ వంటి ప్రతిష్టాత్మక మెగా ఈవెంట్లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చేలా నగరాన్ని క్రీడా హబ్‌గా మార్చేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. కేవలం స్టేడియాల నిర్మాణమే కాకుండా, అంతర్జాతీయ వేదికలపై మన క్రీడాకారులు పతకాలతో సత్తా చాటాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సోమవారం క్రీడా శాఖపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర క్రీడా చరిత్రలో కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టారు.

— ప్రభాత గమనం, హైదరాబాద్

## ప్రజావాణి దరఖాస్తులను
# త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమం
- మొత్తం 136 దరఖాస్తులు స్వీకరణ



— వివరాలు2వ పేజీలో..

# వేం.. ఎన్నిక ఏకగ్రీవం

- ధ్రువపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- ఢిల్లీ వేదికగా రాష్ట్ర సమస్యలపై పోరాడతామని వేం ఉద్ఘాటన

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి సోమ వారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిద్దరి ఎన్నికను ధ్రువీకరిస్తూ రిటర్నింగ్ అధికారి వారికి అధికారిక పత్రాలను అందజేశారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించినందుకు వేం నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

2



— ప్రభాత గమనం, హైదరాబాద్

మంగళవారం
10.03.2026
www.prabhatagamanam.com
PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

# స్టేడియాలను ఆధునీకరించాలి

- స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇతర స్టేడియాల్లో వసతులు కల్పించాలి
- మెగా ఈవెంట్లకు ఆథిత్యం ఇచ్చేలా మైదానాలను తీర్చిదిద్దాలి
- క్రీడా శాఖపై సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ



**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ క్రీడా చిత్రపటంపై అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రణాళికను సిద్ధం చేశారు. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ వంటి మెగా ఈవెంట్లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చేలా, అదే సమయంలో అంతర్జాతీయ వేదికలపై మన క్రీడాకారులు సత్తా చాటేలా స్టేడియంలను, వసతులను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో క్రీడా శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన కీలక దిశానిర్దేశం చేశారు.

## యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. కేవలం భవనాలే కాకుండా, క్రీడాకారులకు ఒలింపిక్స్ లక్ష్యంగా అత్యుత్తమ శిక్షణ ఇచ్చేలా మైదానాలను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించి అధికారులు రూపొందించిన పలు ఆర్కిటెక్చర్ నమూనాలను (డిజైన్లను) ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి, వాటిలో పలు మార్పులను సూచించారు.

## స్టేడియాల రూపురేఖలు మార్చండి!

నగరంలోని ప్రధాన క్రీడా ప్రాంగణాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు:

– గచ్చిబౌలి స్టేడియం: ఇక్కడి ఔట్ డోర్ స్టేడియం పునరుద్ధరణతో పాటు, ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, అధునాతన హాస్టల్ భవనాలు మరియు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– నగరంలోని ఇతర స్టేడియంలు: ఎల్బీ స్టేడియం, కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలను పూర్తిస్థాయిలో ఆధునీకరించి, మెగా పోటీలకు సిద్ధం చేయాలి.

## రాజకీయాలకు అతీతంగా క్రీడా విప్లవం

"తెలంగాణ క్రీడాకారులు ఒలింపిక్ వేదికపై పతకాలు సాధించడమే మన లక్ష్యం. దానికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుంది" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి రామకృష్ణారావు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రపంచ స్థాయి ఈవెంట్లకు వేదికగా హైదరాబాద్‌ను మార్చే ఈ ప్రయత్నం తెలంగాణ క్రీడా చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించబోతోంది.

---

# వేం.. సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవం

- ధ్రువపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- ఢిల్లీ వేదికగా రాష్ట్ర సమస్యలపై పోరాడతామని వేం ఉద్ఘాటన

ప్రభాత గమనం, హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిద్దరి ఎన్నికను ధ్రువీకరిస్తూ రిటర్నింగ్ అధికారి వారికి అధికారిక పత్రాలను అందజేశారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించినందుకు వేం నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.


## - ఢిల్లీ వేదికగా రాష్ట్ర సమస్యలపై పోరాడతాం.

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పెద్దల సభలో గళం విప్పుతానని వేం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని మీడియాకు వివరించారు. ఢిల్లీ స్థాయిలో తెలంగాణ హక్కులను కాపాడటమే తన ప్రాధాన్యతని ఆయన వెల్లడించారు. అనుభవజ్ఞులైన సభ్యులు రాజ్యసభలో అడుగుపెట్టడం రాష్ట్రానికి శుభపరిణామమని మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేస్తూ, నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

---

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్, మార్చి 9 (ప్రభాత గమనం): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె. అనిల్ కుమార్‌లతో కలిసి జిల్లా అధికారులు, మండలాల అధికారులతో దూర సమావేశం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజల న్యాయమైన సమస్యలను తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత శాఖలకు పంపించి సరైన సూచనలు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి అవసరం లేని వస్తువులను తొలగించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని విద్యార్థి వసతి గృహాలను తరచుగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని తెలిపారు. వసతి గృహాల్లో సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 136 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

---



# ఆర్డీటీని రక్షించుకుందాం

- ఎఫ్ సీఆర్ఏ పునరుద్ధరణకు డిమాండ్
- పోస్టుకార్డు ఉద్యమానికి పిలుపు

ప్రభాత గమనం ప్రతినిధి, కళ్యాణదుర్గం: ఆర్‌డీటీ సంస్థను రక్షించుకోవాలని, అనంతపురం అభివృద్ధిని కాపాడాలని కోరుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త డా. తలారి రంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల సేవే లక్ష్యంగా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) సంస్థ ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నదన్నారు. బడుగు, బలహీన వర్గాలు, గిరిజనుల అభివృద్ధి కోసం ఉచిత ఇళ్లు, వైద్యం, విద్యా సహాయం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా చెంచు గిరిజనులకు జీవనోపాధి కల్పిస్తూ పొదుపు సంఘాలు ఏర్పాటు చేయడం, పశువులు, వ్యవసాయ సామగ్రి అందించడం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తున్నదన్నారు. ఆర్‌డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్ఏ అనుమతిని కేంద్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇందుకు మద్దతుగా లక్ష పోస్టుకార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుందుర్పి మండల కేంద్రంలోని ఫాదర్ ఫెర్రర్ గుడి వద్ద జరిగే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



# పాకాల యేటికి ఎస్‌ఆర్‌ఎస్పీ జలాలు వదలాలి

## ప్రజావాణిలో రైతుల వినతి

గార్ల మార్చి 9(ప్రభాత గమనం): రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాకాల యేటికి ఎస్ఆర్ఎస్పీ లేదా తాళ్లపూసపల్లి చెరువు ద్వారా త్రాగు, సాగునీరు అందించాలని రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో రైతులు గ్రీవెన్స్ డేలో ఈ విజ్ఞప్తి చేశారు. పాకాల పరివాహక ప్రాంతంలో సుమారు 500 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలకు ప్రస్తుతం నీటి కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. పంటలు చేతికి రావడానికి ఇంకా 40 రోజులు మాత్రమే ఉండగా యేటిలో నీరు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలు ఎండిపోకుండా తక్షణమే ఎస్ఆర్ఎస్పీ లేదా పాకాల యేటి ద్వారా నీరు వదిలి పంటలను కాపాడాలని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, రైతులు నారెడ్ల సోమయ్య, ఆగాల రాముడు, రాఘవయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# బాస్కెట్ బాల్ పోటీల్లో తృతీయ స్థానం

## టోర్నమంట్ లో ప్రతిభ చూపిన కేసముద్రం జట్టు క్రీడాకారులు

## అభినందించిన స్థానికులు

కేసముద్రం మార్చి 9(ప్రభాత గమనం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో నిర్వహించిన ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో కేసముద్రం జట్టు తృతీయ స్థానం సాధించిం ది. జట్టు విజయం సాధించడంతో సీనియర్ క్రీడా కారులు ఎన్.రవి, ఎం. వెంకన్న, ఎం.హరీష్, ఎన్.అశోక్, బి.రమేష్, పి.రవి, ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ప్రవీణ్, ఎన్. వెంక న్నతో పాటు శారీరక విద్యా ఉపా ధ్యాయుడు కొమ్ము రాజేందర్ అభినందించారు.






# పిలవని పేరంటానికి వస్తే జరిమానా

మహబూబాబాద్ మార్చి 9(ప్రభాత గమనం): పెళ్లిళ్లు, శుభకార్యాలకు పిలవని వ్యక్తులు వచ్చి భోజనం చేయడం వల్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశారు. పిలవని వారు ఫంక్షన్ కు హాజరైతే జరిమానా విధిస్తామని బోర్డులో పేర్కొనడంతో ఇది చర్చనీయాంశంగా మారింది. శుభకార్యాలకు ముక్కు మొహం తెలియని వారు వచ్చి భోజనం చేయడం వల్ల అసలు బంధువులకు భోజనం సరిపోని పరిస్థితి ఏర్పడుతుందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఫంక్షన్ హాళ్లో ఖర్చులు ఎక్కువగా ఉండటంతో ఇటువంటి పరిస్థితులు రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు

- మాటలకే పరిమితమైన సీఎం రేవంత్
- మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్

వరంగల్ బ్యూరో మార్చి 9(ప్రభాత గమనం): పెట్టుబడి సహాయం కోసం రైతులు ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారని నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ అన్నారు. సోమవారం తన నివాసంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు అహోరాత్రులు కష్టపడి సాగు చేస్తున్నప్పటికీ పంటల నుంచి సరైన లాభం రావడం లేదని, తదుపరి పంటకు పెట్టుబడి కోసం ఇతరుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోందని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశే ఖర్ రావు రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసి ఆదుకున్నారని గుర్తుచేశారు. అయితే ఎన్నికల ముందు రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.12



వేల సాయం ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. రైతులను విస్మ రించిన ఏ ప్రభుత్వం కూడా చరిత్రలో నిలవదని, వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రపంచ గ్లాకోమ వారోత్సవాలు

## ఈ నెల 8 నుంచి 14 వరకు నిర్వహణ




మహబూబాబాద్ మార్చి 9(ప్రభాత గమనం): ప్రపంచ గ్లాకోమ వారోత్స వాలను ఈ నెల 8 నుంచి 14 వరకు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా గ్లాకోమ వ్యాధిపై అవ గాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. భారతదేశంలో ఉన్న అంధులలో సుమారు 6 శాతం మంది గ్లాకోమ (నీటికాసులు) వ్యాధి కారణంగా దృష్టి సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో కొంతమంది పూర్తిగా అంధత్వానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మసక వెలుతురులో వస్తువులు స్పష్టంగా కనిపించ కపోవడం, వెలుతురు చుట్టూ రంగుల వలయాలు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మహబూబాబాద్‌తో పాటు క్లస్టర్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు.

# గార్ల ఎమ్మార్వో, ఎంపీడీవోలను సస్పెండ్ చేయాలి

## మున్నేరు జలసాధన కమిటీ నాయకుల డిమాండ్

గార్ల మార్చి 9(ప్రభాత గమనం): మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ అంశంలో రాజ్యాంగపరమైన విధివిధానాలు పాటిం చకుండా వ్యవహరిస్తున్న గార్ల మండల తహసీల్దార్ ఆర్. శారద, ఎంపీడీవో మంగమ్మలను సస్పెండ్ చేయాలని మున్నేరు జలసాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.




సోమవారం గార్ల మండల కేంద్రంలోని కమిటీ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో కన్వీనర్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, కన్వీనర్లు జడ సత్యనారాయణ, కందునూరి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. పేషా చట్టం ప్రకారం గ్రామ కమిటీలను ఏర్పాటు చేయకుండా పోలీసుల పహారాలో గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజలను, రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. మున్నేరు–పాలేరు లింక్ కెనాల్‌పై సరైన సమాచారం ఇవ్వకుండా రహస్యంగా తీర్మానాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారుల తీరుతో భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అనంతరం మండల కేంద్రంలో నాయకులు, రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కందునూర్ ఈశ్వర్ లింగం, తోట కొండల్ రావు, శివాజీ, చంటి, అరుణ్ తదిత రులు పాల్గొన్నారు.

# చంద్రబాబును విమర్శించే అర్హత లేదు

## - మాజీ సీఎం జగన్ పై మంత్రి సవిత ఫైర్

పెనుకొండ/శ్రీసత్యసాయి ప్రభాత గమనం ప్రతినిధి : మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తీవ్ర విమర్శలు చేశారు. పెనుకొండలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలను గౌరవించని వ్యక్తికి ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. శాసనసభలో తల్లిలాంటి భువనేశ్వరిని అవమానించారని, సొంత తల్లి, చెల్లిని గౌరవించని వ్యక్తి మహిళల గురించి మాట్లాడటం తగదని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలపై అనేక దాడులు, దాష్టీకాలు జరిగాయని ఆరో పించారు. అప్పట్లో బస్సు ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని, ప్రస్తుతం తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి అండగా నిలిచింద న్నారు. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.రాయలసీమ అభివృద్ధిపై కూడా జగన్ విమర్శలు చేయడం తగదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీ మలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా నిర్మించలేదని, చెరు వులకు నీరు నింపలేదని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమలో పరిశ్రమలు, తోటపంటలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతు న్నాయని మంత్రి సవిత పేర్కొన్నారు.



మంగళవారం
10.03.2026
www.prabhatagamanam.com
PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- ఇందిరమ్మ ఇండ్లు, టెన్త్ పరీక్షలపై సమీక్ష
- హాజరైన పలు శాఖల అధికారులు



మహబూబాబాద్ మార్చి 9(ప్రభాత గమనం): జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సోమవారం వీడియో సమావేశం నిర్వహించారు. హౌసింగ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, విద్యాశాఖ అధికారులతో కలిసి పథకాల అమలుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన 10,181 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన–ప్రగతి కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 3,682 గృహప్రవేశాల లక్ష్యం ఉందని, మార్చి చివరి నాటికి 2,000, మే చివరి నాటికి మిగిలిన ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణసహాయం కల్పించాలని తెలిపారు. అలాగే ఈనెల 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల హాజరు, బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అదనపు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ హన్మ నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, ఏసీజీ శ్రీరాములు, సుధాకర్ పూర్ణచందర్, సంతోష్, వివిధ మండలాల అసిస్టెంట్ ఇంజనీర్స్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల విద్యాశాఖ అధికారులు, పాల్గొన్నారు.



## ఎల్లయ్య కుటుంబానికి పరామర్శ

కేసముద్రం మార్చి 9(ప్రభాత గమనం): కేసముద్రం మున్సిపాలిటీ చెందిన బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలెపాక నాగరాజు, వీహెచ్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేపాక శంకర్ తండ్రి పోలెపాక ఎల్లయ్య దశదినకర్మకి ఎమ్మెల్యే మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, వైస్ చైర్ పర్సన్ అల్లం రమ వేర్వేరుగా హాజరై ఎల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ లు తరాల వీరేష్ యాదవ్, వల్లందాసు ఉమారవి , దారవత్ కిషోర్, నాయకులు నీలం దుర్గేష్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, ఇనుగుర్తి మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్, జిల్లా యూత్ అధ్యక్షులు సురేష్ నాయక్, చింతకుంట్ల వెంకన్న, మాజీ సర్పంచ్ బట్టు శ్రీనివాస్, నాయకులు బనిశెట్టి వెంకటేష్, శీలం సత్యనారాయణ, మహ్మద్ తాజుద్దీన్, బద్య నాయక్, ప్రభురాణి, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### చిలువేరు సమ్మయ్య గౌడ్ పరామర్శ..

పోలెపాక ఎల్లయ్య దశదిన కర్మకు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎల్లయ్య మరణం కుటుంబానికి తీరని లోటని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్, మాజీ సర్పంచ్ ఐతే సారయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, కొలిపాక వెంకన్న, ఎల్ఐసీ ఆనంద్, ముఖేష్, రవి నాయక్,ఇస్లావత్ చందు పాల్గొన్నారు.

## రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ సునీత వెంకన్న
- డ్రోన్ ను ప్రారంభించిన చైర్ పర్సన్



కేసముద్రం మార్చి 9(ప్రభాత గమనం): మారుతున్న కళనుగుణంగా రైతులు సాంకేతికతను అందిపుచుకోవాలనీ కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ భానోత్ సునీత వెంకన్న పేర్కొన్నారు. సోమవారం కేసముద్రం మండలం ప్రాథమిక వ్యవసాయ సంఘం దన్నసరి ఆధ్వర్యంలో సొసైటీ గోదాం వద్ద డ్రోన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేసముద్రం మున్సిపాల్ చైర్ పర్సన్ బానోత్ సునీత–వెంకన్న, ఆర్టిఏ డైరెక్టర్ రావుల మురళి , మహబూబాద్ డిసిఓ సంజీవరెడ్డి, డిసిసిబి బ్యాంక్ వరంగల్ సీఈఓ సుల్తాన్, డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీర శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈసందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ కేసముద్రం సునీత– వెంకన్న మాట్లాడుతూ.. డ్రోన్ ద్వారా పిచికారి చేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. డ్రోన్ ద్వారా పిచికారి చేయడం వల్ల పంటపై మందు కరెక్టు మోతాదులో పడి పురుగులు, తెగుళ్లపై కచ్చితంగా డోస్ పడడం వల్ల వాటి యొక్క ఉధృప్తి తగ్గి పంట ఏపుగా వచ్చి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వారుడ్రోన్ ద్వారా పై నుంచి పిచికారీ చేయడం వల్ల పంట అంతటా ఒకేలా మందు పడుతుంది, దిగుబడి పెరుగుతుంది అని అన్నారు.

### జాగ్రత్తలు పాటించాలి

రైతు సోదరులు పాత పద్ధతులను వదిలి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. డ్రోన్ టెక్నాలజీతో ఖర్చులు తగ్గి, లాభాలు పెరుగుతాయి అన్నారు వివరించారు. సాధారణ పద్ధతిలో పిచికారి చేయడం వలన రైతులు పిచికారీ చేసే సమయంలో మాస్కులు గాని, అదే విధంగా సరియైన ఆప్రానులు, హెల్మెట్ వాడకపోవడం వలన రైతులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు.

### - డ్రోన్ పిచికారీతో ఉపయోగాలు

డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల రైతులకు కలిగే ఉపయోగాలు వివరించారు. మనుషులతో కొట్టే మున పద్ధతి తో పోలిస్తే డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వలన ఖర్చు చాలా తక్కువ అని అన్నారు. రైతు సోదరులు అందరూ డ్రోన్ ను ఉపయోగించి ఖర్చులను తగ్గించాలని వారు కోరారు. మనుషుల ద్వారా పిచికారీ చేయడం వలన 20 నుంచి 30శాతం మందు వృధా అవుతుంది అని డ్రోన్ 5 టూ 10శాతం కూడా వృథా కాదని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకన్న, సీఈఓ, కౌన్సిలర్ దారావత్ కిషోర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బిచ్చునాయక్ తండా కార్యదర్శి పై చర్యలు తీసుకోండి

- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ రవి నాయక్




కేసముద్రం మార్చి 9(ప్రభాత గమనం): కేసముద్రం మండలం బిచ్చ నాయక్ తండా గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఇస్సంపల్లి నాగార్జున పై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎంపీడీవోకు ఆ గ్రామ సర్పంచ్ వాంకుడోత్ రవి నాయక్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి రూ. 8.70 లక్షలు ఖర్చు చేసినట్లుగా గ్రామపంచాయతీకి తప్పుడు లెక్కలు చూపెడుతున్నాడని తెలిపారు. ఆ డబ్బులను పంచాయతీ కార్యదర్శి కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో వసూలు చేసిన పన్నులు సైతం కార్యదర్శి సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు జీపీ తీర్మానం ఇవ్వకుండా కార్యదర్శి జాప్యం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సైతం గ్రామంలో నిర్వహించడం లేదని మండిపడ్డారు. ప్రజల చేత ఎన్నికైన సర్పంచ్ ను అవమానిస్తూ మనోవేదనకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీవోను కోరారు.

### - పంచాయతీ కార్యదర్శి వివరణ...

తనపై సర్పంచ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కార్యదర్శి ఇస్సంపల్లి నాగార్జున తెలిపారు. పనులు చేయకుండానే తీర్మానాలు ఇవ్వాలంటూ వేధిస్తున్నారని తెలిపారు. గత ఆరేళ్లుగా తన విధులకు అడ్డుపడుతున్నాడని, వ్యక్తిగత కక్షలతో తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శి చేసిన పనులకు బిల్లులు అడిగినందుకు లక్ష రూపాయలు డిమాండ్ చేశారని ఆరోపించారు. పదవిని అడ్డం పెట్టుకొని చట్టవిరుద్ధమైన ఎన్నో కార్యక్రమాలు చేశారని పూర్తి ఆధారాలతో పైఅధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

## 11న మహబూబాబాద్ లో ఉద్యోగ మేళా



మహబూబాబాద్ మార్చి 9(ప్రభాత గమనం): ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఫ్లిప్‌కార్ట్) సంస్థలో డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం ఈ నెల 11న మహబూబాబాద్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి. రజిత తెలిపారు. పదవ తరగతి పైగా చదివిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని చెప్పారు. అభ్యర్థులకు డ్రైవింగ్ లైసెన్స్, బైక్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, కురవి రోడ్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం (రూమ్ నం.25)లో విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9121268407, 9908073593 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra